ప్రయాణీకులతో ప్లాట్ ఫారమంతా హడావుడిగా వుంది. సెండాఫ్ ఇవ్వడానికి వచ్చిన వాళ్ళు, రిసీవ్ చేసుకోవడానికి ఎవరో వస్తారని ఎదురు చూసే వాళ్ళు, 'చాయ్ చాయ్' అంటూ చేత్తో టీ కప్పులతో తిరుగుతున్న వాళ్ళు, ఓ పదీ పదిహేను బిస్కెట్ ప్యాకెట్లను చేత్తో పట్టుకుని, పిల్లల దగ్గరే తచ్చాడుతూ, తినాలనే ఆశను పుట్టిస్తూ బిజినెస్ చేస్తున్న వాళ్ళు, ఉదయమే తెగిపడిన పావురం రెక్కల్లాంటి వార్తా పత్రికలను చేతిలో వుంచుకొని వాటి నామస్మరణ పెద్దగా చేస్తూ అటూ ఇటూ తిరుగుతున్న వాళ్ళు, ఇంకా పాలక్యానులతో కూరగాయల తట్టలతో ప్రక్క వూళ్ళల్లో వ్యాపారం చేయడానికి వెళ్తున్న వర్తకులు, వీళ్ళందరితో ఆ రైల్వే స్టేషన్ ఎంతో సందడిగా వుంది.

అప్పుడే వచ్చిన రామచంద్రమూర్తి ఆఫీసు రూమ్ తెరచి లోనికెళ్ళి కుర్చీలో కూర్చొని రిలాక్స్ అవుతుండగా ఫోన్ మ్రోగింది.

ప్యాసింజర్ ట్రైయిన్ రావడానికి మరెంతో వ్యవధి లేదు. మూర్తి కౌంటర్ ఓపెన్ చేసి టిక్కెట్లు ఇష్యూ చేయడం ప్రారంభించాడు.

కొంత సేపటికి కౌంటర్ క్లోజ్ చేసి ఫ్లాగ్స్ తీసుకుని బయట కొచ్చి ప్రయాణీకుల మధ్య నిలబడ్డాడు. మూర్తిని ఎరిగిన వాళ్ళు, కాస్తో కూస్తో పరిచయమున్న వాళ్ళు అతన్ని చుట్టుముట్టారు. వాళ్ళతో నవ్వుతూ సంభాషిస్తున్నాడతను. "అయ్యా! బండేమైనా లేటుందా" అనో, "బాబుగోరూ! తిరిగి అట్నుంచి ఇటొచ్చే బండి మళ్ళీ ఎన్ని గంటలకున్నది" అనో లేకపోతే వాళ్ళు వెళ్ళవలసిన స్టేషన్ పేరు చెప్పకుండానే "సారో! ఇది మావూరికి పోయేసరికి ఎంతవుద్ది" వంటి అనేకానేక ప్రశ్నలకు ఏమాత్రం విసుగు లేకుండా సమాధానాలు చెప్తుండగా రానే వచ్చింది ప్యాసింజరు రైలు.

అందరూ రైలు ఎక్కేశారు. రైలు కదిలింది. దిగిన ప్యాసింజర్స్ దగ్గర్నుంచి టికెట్స్ కలెక్ట్ చేసి తిరిగి వెళ్ళి కుర్చీలో జారబడ్డాడు మూర్తి. వెళ్ళి పోతున్న రైలు కూత చాలా చిన్నగా సన్నగా వినబడుతోంది. ఇంటి దగ్గర్నుంచీ తెచ్చుకున్న ఫ్లాస్కులోంచి కప్పులోకి కాఫీ వంచుకుని తాగాడు మూర్తి.

తిరిగి మరలా దిగువ రైలు వచ్చేంత వరకు ఖాళీయే! ఆ స్టేషన్‌లో అతనొక్కడే! రోజూలాగే ఒంటరిగా ఫీలవుతూ టేబుల్ పైనున్న న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకున్నాడు మూర్తి.

ఊరికి రెండు కిలో మీటర్ల దూరంలో కేవలం ప్యాసింజర్ ట్రైయిన్స్ మాత్రమే ఆగే ఆ చిన్న రైల్వే స్టేషన్‌కి ఏ ఎస్సెమ్‌గా కొన్ని సంవత్సరాల నుంచీ ఉంటున్నాడతను. ట్రాన్స్‌ఫర్ కోసం ప్రయత్నం చేయలేదని చెప్పడం కాదు, వచ్చిన ట్రాన్స్‌ఫర్‌ని కావాలని కష్టపడి కాన్సిల్ చేయించుకుంటూ వస్తున్నాడతను.

కారణం, అక్కడ వాతావరణానికి అతను, అతని భార్యా బాగా అలవాటు పడడమే! ఆ వూరి జనానికి పెద్ద దిక్కుగా ఉంటున్నారా ఇద్దరూ. అదీ గాక ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయిన తరువాతే, పెద్దోడికి గవర్నమెంట్ జాబొచ్చి సెటిలయ్యింది. ఒక్కగానొక్క కూతురికీ మంచి సంబంధం చూసి పెళ్ళి జరిపించింది, చిన్నోడికి మెడిసిన్‌లో సీటు రావడం, వాడు కోర్సు విజయవంతంగా ముగించి, గవర్నమెంట్ సర్జన్ అయ్యి, ఓ యింటి వాడవడం కూడా ఇక్కడ వుండగానే అయింది. అందుకే అది పుట్టినూరు కాకపోయినా, అలానే భావిస్తు వస్తున్నారంతా, పిల్లలు కూడా పండగలకు పబ్బాలకు సొంతవూరికి వెళ్తున్నట్లుగానే సంబర పడిపోతూ వచ్చి, సెలవులు అయి పోగానే తల్లిదండ్రులను, పెరిగిన ఆ ప్రదేశాన్ని వీడలేక వీడలేక బాధతో విడిచి పెట్టి మరలా వచ్చే పండగల కోసం ఎదురు చూస్తూ గడుపుతున్నారు.

గదిలోని పాత గోడ గడియారం అతి కష్టమ్మీద తొమ్మిది గంటలు కొట్టింది. టాంగా వచ్చి ఆగిన శబ్దం వినిపించి, తలతిప్పి వెనుక కిటికీలోంచి చూశాడు మూర్తి. తమ పక్కింటి స్వామి టాంగాలోంచి ఒక్క ఉదుటున కిందకు దూకి వేగంగా లోపలికొస్తున్నాడు.

డోర్ దగ్గర నిల్చొని రొప్పుతూ "సార్! త్వరగా ఇంటికి బయలుదేరండి. సావిత్రమ్మ గారికి చాలా సీరియస్‌గా వుంది" అన్నాడు.

"ఏంటి స్వామీ, నువ్వుచెప్పేది. ఇంతకూ అసలేమయింది. ఉదయం నేను బయలుదేరినప్పుడు ఏమీ లేదుగా" ఆత్రంగా అతని భుజాలు పట్టుకుని రెట్టించి అడిగాడు మూర్తి.

"ముందు బయలుదేరండి సార్! అన్నీ వివరంగా చెబుతాను" స్వామి తనే తాళం వేసి, మూర్తిని తీసుకుని బయలుదేరాడు, తిరిగి అదే టాంగాలో.

"ఇప్పుడైనా చెప్తావా అసలేమైందో" మూర్తి సహనం కోల్పోయినట్లున్నాడు.

ఎలా చెప్పాలో, చెప్పిన తరువాత విని తట్టుకోగల గుండె ధైర్యం అతనికి వుందో లేదోనన్న ఆలోచనలతో సతమతమవుతూ స్వామి చెప్పడం ప్రారంభించాడు.

మూర్తి స్టేషన్‌కి వచ్చాక, రోజూ లాగానే తులసి కోటకి ప్రదక్షిణాలు చేస్తుండగా, కళ్ళు తిరిగి పడిపోయింది సావిత్రమ్మ. అప్పుడప్పుడూ ఫిట్స్ వచ్చి ఆమె అలా పడిపోవడం సహజమే! అందుకు గాను, ఆమెను ఎంతో మంది పెద్ద పెద్ద డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్ళాడు. ఖరీదైన ట్రీట్‌మెంట్ ఇప్పించాడు మూర్తి. అయినా ఫలితం కన్పించలేదు.

ఆమె అలా కిందపడిపోయినప్పుడు తలకి కిందనున్న ఓ రాయి బలంగా కొట్టుకోవడంతో, రక్తం కారి ఆమెకు స్పృహ తప్పింది. ఇంటి చుట్టుపక్కల వాళ్ళు వెంటనే వచ్చి ఏదో తమకు తోచిన విధంగా ఫస్ట్ ఎయిడ్ చేసి చూసి ఫలితం కనిపించక పోవడంతో, వెంటనే దగ్గర్లో వున్న హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. డాక్టర్ పరీక్ష చేసి, తలలో తగలకూడని ప్రదేశంలో దెబ్బ తగిలిందని, పట్నం తీసుకెళ్తే తప్ప లాభం లేదని చెప్పడంతో కంగారు పడిపోయి, స్వామి, మూర్తి దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

అంతా విన్న తర్వాత "ఇంతకీ ఇప్పుడెలా వుంది స్వామీ" మూర్తి గొంతులో వణుకు స్పష్టంగా కన్పించింది.

"కంగారు పడకండి సార్. అమ్మగారికేంకాదు. ఆమె చేసే పూజలు వ్రతాలు మీకు తప్పకుండా మేలు చేస్తాయి. ధైర్యంగా వుండండి" మూర్తికి ఎన్నో విధాల ధైర్యం చెప్పడానికి ప్రయత్నం చేశాడు స్వామి.

* * *

ఇంటి చుట్టూ జనం. లోపల నుంచి ఏడుపులు వినిపిస్తున్నాయి. ఎవరెవరో వస్తున్నారు. సానుభూతి కబుర్లు చెప్తున్నారు.

రోజూ తులసి మొక్క దగ్గర దివ్యంగా వెలుగుతుండే దీపం ఈ రోజు సావిత్రమ్మ తల దగ్గరకు చేరి వెలవెలా బోతూ వుంది. తనతో ముప్పై ఏళ్ళుగా కాపురం చేసి, ఈ రోజు తనని విడిచి, ఒంటరిని చేసి వెళ్ళిపోయిన భార్య సావిత్రమ్మ వైపు దీనంగా చూస్తూ వస్తున్న కన్నీటిని ఆపుకోవడానికి, శతవిధాల ప్రయత్నం చేస్తూ, మౌనంగా రోదిస్తూ, మాతృ వియోగ దుఃఖంతో కుమిలి పోతున్న కొడుకులిద్దర్నీ అక్కున చేర్చుకుని వాళ్ళను ఓదార్చడానికి ప్రయత్నం చేస్తున్నాడు మూర్తి.

కూతురు సీత కన్నతల్లి శవంపై పడి శోకాలు పెట్టి ఏడుస్తోంది. ఎందరో సర్ది చెప్పబోయినా ఆమె వూరుకోవడం లేదు. తల్లి తమకు లేకుండా వెళ్ళిపోయిందన్న ఆలోచనే భరించలేక పోతూందామె.

జీవి పుట్టేటప్పుడు ఏడుస్తూ పుడ్తుంది. కానీ చనిపోయి అందర్నీ ఏడిపిస్తుంది. సాయం సమయానికి సావిత్రమ్మ శవానికి దహన సంస్కారాలన్నీ జరిపించారు. కర్మ కాండలన్నీ ముగిశాక వచ్చిన బంధువులంతా తిరుగు ప్రయాణమయ్యారు.

వెళ్తూ వెళ్తూ కొడుకులిద్దరూ తండ్రికి ధైర్యం చెప్పారు. విశ్రాంతిగా వుండమన్నారు. కూతురు తండ్రి అక్కున చేరి మరలా భోరుమంది. ఎలా వచ్చిన వాళ్ళు అలా వెళ్ళిపోయారు. చివరికి అంత ఇంట్లో తనొక్కడిగా మిగిలిపోయాడు మూర్తి.

సెలవులకు వచ్చినప్పుడు పిల్లలతో సరదాగా కబుర్లాడుతూ, మనవలతో ఆడుకుంటూ గడిపేసి, తిరిగి వాళ్ళు వెళ్ళిపోగానే వాళ్ళ మీద బెంగతో పడక్కుర్చీలో వాలి, ముభావంగా వున్నప్పుడు, భార్య ఆ మాటా ఈ మాటా చెప్పి 'మరలా దసరా సెలవులు ఇంకెన్ని రోజులున్నాయేంటి? అప్పుడు మళ్ళీ వస్తారుగా ఎప్పుడూ మీ కళ్ళముందే కూర్చుంటే వాళ్ళ జీవితాలు ఎలాగడుస్తాయి' అంటూ మూర్తికి మరపు కలిగించేది సావిత్రి.

కానీ ఇప్పుడు తనకు తన తోడు లేదు. తనను లాలించి, పాలించి, ఓదార్పునిచ్చి, సానుభూతి చూపించి, ఊరట కలుగచేసే భాగస్వామి తనతో లేదు. దూరంగా వెళ్ళిపోయింది. ఎవరో చెప్పినట్లు మగవాడి జీవితంలో ఆడది మూడు ముఖ్యమైన పాత్రలు వహిస్తుంది. యవ్వనంలో ప్రియురాలిగా, మధ్య వయస్సులో స్నేహితురాలిగా, వృద్ధాప్యంలో సేవకురాలిగా.

ప్రియురాలిగా మధురమైన తీపి జ్ఞాపకాలు మిగిల్చింది. స్నేహితురాలిగా కష్ట సుఖాలు పంచుకుంది. భయంతో వెను కడుగువేసినప్పుడు ధైర్యం చెప్పి ముందుకు సాగనంపింది. తను జీవితంలో ఏమైనా సాధించగలిగాడు అనుకుంటే దానికి వెనుక గల కారణం భార్య ప్రోత్సాహమే! చివరికి వృద్ధాప్యంలో అడుగు పెట్టినప్పుడు సేవకురాలిగా మారి తనతో చివరి మజిలీ వరకు ప్రయాణం చేయలేక అలసిపోయి కాబోలు, అవనికొరిగిందామె అనుకున్నాడు మూర్తి సావిత్రిని గురించి.

ఇప్పుడిక తను ఎందుకోసం బ్రతకాలి? ఎవరి కోసం బ్రతకాలి?? పిల్లలు చివరి సంసారం గొడవల్లో వాళ్ళు మునిగిపోయి వున్నారు. ఏదో సెలవులకు విహార యాత్రగానో రిలీఫ్ కోసమో అన్నట్లుగా ఇక్కడికి వచ్చి వెళ్తారు. తనను పట్టించుకోవాల్సిన అవసరం వాళ్ళకేమిటి? తన ప్రసక్తి వాళ్ళకెందుకు??

చివరి వరకు తననే నమ్ముకుని కాలం విడదీస్తే తప్ప వీడకుండా వుండే బంధం భార్య ఒక్కతే మగవాడి జీవితంలో. ఆ బంధమే ఇప్పుడు దూరమై పోయింది. ఏముంది జీవితంలో ఇప్పుడు? నిండా నిండిన ఒంటరి తనం తప్ప! కాంతి కోల్పోయిన ఏకాంత జీవితం మినహా!

ఇప్పుడతని జీవితం ఓ ఎడారి... ఓ శూన్యం. మూర్తి కళ్ళల్లోంచి నీళ్ళు ధారాపాతంగా కారాయి. అప్పటి వరకు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చిన అతను, కీర్తి శేషురాలైన శ్రీమతి ఫోటోను గుండెలపై వుంచుకుని ఈ వియోగాన్ని భరించడం ఇక తన వల్ల కాదన్నట్లుగా ఒక్కసారిగా భోరుమన్నాడు మూర్తి. కన్నీళ్ళు సావిత్రమ్మ ఫోటో పైకి జాలువారుతూ, ఆ ఫోటోను అభిషేకించాయి.

తను అలా వేదన అనుభవిస్తుంటే ఒకప్పటిలా తన ఒడిలోకి తీసుకుని ఓదార్చే చల్లని ఒడి లేదు కదా ఇప్పుడు! దగ్గరకు తీసుకుని సానుభూతిని వర్షించే వెచ్చటి కౌగిలి ఇప్పుడు లేదుకదా తనకి?!

నిజం చెప్పాలంటే వృద్ధాప్యంలో భార్య లేనితనమంత భయంకరం మరొకటుండదు అనడం గొప్ప నిజం!

* * *

ప్యాసింజర్లు, 'కాఫీ, టీ' అంటూ అరుస్తూ తిరుగుతున్న వాళ్ళు, బిస్కెట్లు పాకెట్లు అమ్మి ఎవరికో లాభాలు తెచ్చిపెట్టడానికి తమ బాల్యాన్ని అమ్మిన వాళ్ళు, పాల వ్యాపారులు, కూరగాయల గంపల వాళ్ళు, 'న్యూస్ పేపర్... న్యూస్ పేపర్' అంటూ అరిచే వాళ్ళు, వీళ్ళందిరతో రోజూలాగావే ఆ సమయానికి ప్లాట్ ఫారమంతా రద్దీగావుంది.

మూర్తి కాస్త ఆలస్యంగా వచ్చాడు స్టేషన్‌కి. కౌంటర్ ఓపెన్ చేసి టిక్కెట్స్ ఇష్యూ చేయడం ప్రారంభించేడు. ఒకప్పటిలా తను బేలన్స్‌డ్‌గా పని చేయలేకపోతున్నాడు. టిక్కెట్స్ ఇచ్చేటప్పుడు ఛేంజ్ ఎంతంటే అంత ఇచ్చేస్తున్నాడు. ఎక్కువ వచ్చిన వాళ్ళు తిరిగి ఇస్తే తీసుకుంటాడు. తక్కువ వచ్చిన వాళ్ళు గదమాయిస్తే 'సారీ' చెప్పి సర్దుకుపోతున్నాడు. అందుకే, రోజు ఎకౌంట్ ట్రాన్సాక్షన్స్ సరిగ్గా టాలీ అవ్వడం లేదు.

భార్య జ్ఞాపకాల నుంచి దూరం కాలేక పోతున్నాడతను.

ఈ మధ్య ఇంటికి సరిగ్గా వెళ్ళడం లేదు. స్టేషన్‌లోనే వుండిపోతున్నాడు. ఇంటికెళ్తే అటూ ఇటూ గొప్ప సందడి చేస్తూ తిరిగే భార్య గుర్తుకు రాకుండా వుండడం లేదు. ఇంటికెళ్ళి తలుపు తెరచి లోన అడుగు పెడ్తే చాలు! ఆమె జ్ఞాపకాలు అతన్ని చుట్టుముట్టి దాడి చేస్తున్నాయి.

మనిషికి మరుపు గొప్ప వరం. చేదు జ్ఞాపకాలు చెద పురుగులై మెదడుని తొలిచేస్తున్నప్పుడు వాటి బారి నుంచి మనల్ని రక్షించేది ఈ మరుపే.

వియోగానికి మరుపనేది కనుక లేకపోతే తన జీవితం వ్యర్థంగా మారకుండా వుండదు. కానీ మూర్తి ఎలా మరచిపోగలదు సావిత్రిని?!

మరచిపోవడానికి ఎంతో ప్రయత్నం చేశాడు. అసాధ్యమని తెల్సుకున్న తర్వాత తిరిగి ఆమె జ్ఞాపకాల పొదలోతరుముకొస్తున్న ఒంటరి తనం బారి నుంచి తనని తాను రక్షించుకోవడం మొదలెట్టాడు.

జీవితం ఏడంకాల నాటకమైతే బహుశా అతను చివరి అంకంలో వున్నాడేమో! మధ్యంకంలో తన జీవితంలోకి ప్రవేశించి ఆరో అంకం వరకూ తనతో వున్న భార్యతో హాయిగా గడిపేశాడు. ఇక చివరి అంకంలో కనీసం భార్య జ్ఞాపకాలతో నైనా గడపాలి కదా! ఇదేనేమో మూర్తి నిశ్చయం.

దూరం నుంచి రైలు వస్తున్న శబ్దం చాలా చిన్నగా గాల్లో కలసి పోయి వస్తూంది.

మూర్తి ఫ్లాగ్స్ తీసుకుని బయటకొచ్చి నిలబడ్డాడు. ఎవరో పరిచయమున్న వాళ్ళు ముగ్గురు నలుగురు అతని దగ్గర కొచ్చి చేరారు. కానీ ఇప్పుడతను ఒకప్పటిలా హుషారుగా ఎవరితోనూ మాటా మంతీ చేయడం లేదు. అలాగే పాసింజర్స్‌కుకావాల్సినఇన్‌ఫర్మేషన్ కూడా చాలా మూడీగా ఇస్తున్నాడు.

వెళ్ళ వలసిన వాళ్ళంతా రైలు వచ్చీ రాగానే హడావుడిగా ఎక్కేసి, సీట్లు వెతుక్కుంటుండగానే రైలు కదిలింది– పెద్ద పెట్టున కూత వేసుకుంటూ!

రైల్లోంచి దిగిన ఒకేఒక వ్యక్తి టిక్కెట్ మూర్తి చేతికి ఇచ్చేసి వెళ్ళిపోయాడు.

కాఫీ, టీ కుర్రోళ్ళు, బిస్కెట్లు అమ్ముతున్న పిల్లలు అందరూ ఊళ్ళోకి వెళ్ళిపోయారు తిరిగి. ఇప్పుడా రైల్వేస్టేషన్ మూర్తి జీవితంలా వుంది.

రైలు వచ్చే ముందు అందరూ ఎంతో ఉత్సాహంతో అక్కడకు చేర్తారు. రైలు వచ్చే వరకు ఎంతో సందడి చేస్తూ ఆనందంతో అక్కడ గడుపుతారు. రైలు రాగానే హడావుడిగా ఎక్కేసి అప్పటి వరకు తమకు ఆశ్రయం ఇచ్చిన ఆ స్టేషన్‌ని ఇట్టే మర్చిపోతారు. అప్పుడు ఆ స్టేషన్ బోసి తనాన్ని కప్పుకుని తిరిగి మరలా వచ్చే రైలు కోసం వచ్చే ప్రయాణీకుల కోసం ఎదురు చూడాల్సిందే!

తనూ అంతే గదా!

కానీ తన జీవితం స్టేషన్‌ని విడిచి వెళ్ళిపోయిన సావిత్రి అనబడే రైలు మాత్రం ఇక ఎప్పటికీ తిరిగి రాదాయె!

స్టేషన్‌లో ఏకాకిగా నిల్చొన్న మూర్తి మూర్తీభవించిన దుఃఖంలా ఉన్నాడు.